క్లుప్తంగా

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి

నర్మెట: ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలని డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రావుల రామ్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సహకరించాలని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు షర్మిలను కోరారు. పాదయాత్రలో భాగంగా ఆమె ఆదివారం వెల్దండకు చేరుకున్న సందర్భంగా నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను షర్మిలకు వివరించారు. స్పందించిన ఆమె తనవంతు కృషి తప్పకుండా చేస్తానని హామీ ఇచ్చారు.

కారు, బైక్ ఢీ..

బచ్చన్నపేట: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలోని పోచన్నపేటలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు మల్లేషం కుమార్తె అర్చనతో కలిసి వ్యవసాయ బావివద్దకు వెళ్తున్న క్రమంలో ఆలేరు నుంచి బచ్చన్నపేట వైపునకు వస్తున్న కారు ఢీకొట్టడంతో మల్లేషం తల, కాలుకు, అర్చన కాలుకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన గ్రామస్తులు ఇరువురిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించడంతోపాటు స్థానిక పోలీసులకు సమాచరమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై సృజన్ కుమార్ తెలిపారు.

టైరు పేలి కారు బోల్తా.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



చిల్పూరు: మండలంలోని చిన్న పెండ్యాల సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి వేగంగా వెళ్తున్న కారుటైరు పేలడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై వినయ్‌కుమార్ అందించిన వివరాలు.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన ధనుంజయ్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. ఆదివారం హనుమకొండలో పెళ్లి విందుకు తన కారులో డ్రైవర్ శ్రీకాంత్‌తో కలిసి హాజరయ్యాడు. తిరిగి రాత్రి వేగంగా వెళ్తున్న కారు టైరు ఒక్కసారిగా పేలడంతో కారు ఎగిరి కిందపడగా డోర్ తెరుచుకోవడంతో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రజల మనోభావాలకు ప్రాధాన్యం ఇస్తా

- మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి

ధర్మసాగర్ : ప్రజల మనోభావాలకు ప్రాధాన్యం ఇస్తానని మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి తెలిపారు. మండలంలోని తాటికాయల గ్రామంలో పరిశుద్ధ ఫాతిమా మాత చర్చి నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడారు. కష్టపడితే సాధ్యం కానిదేదీ లేదని స్పష్టం చేశారు. అందరూ సమష్టిగా కృషి చేసి చర్చిని నిర్మించుకోవాలని సూచించారు. చర్చి నిర్మాణానికి తన సహాయం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పెసరు రమేష్, ఫాదర్లు పూదోట దాసయ్య, బాలశౌరి, థామస్ కిరణ్, ఎంపీటీసీ ననుబాల సోమక్క, ఉపసర్పంచ్ అన్నపూర్ణ, పెద్దపెండ్యాల మాజీ ఎంపీటీసీ తోట నాగరాజు, రాయిగూడెం సర్పంచ్ వాంకుడోతు రాజమణి మొగిలి, చర్చి నిర్మాణ కమిటీ అధ్యక్షుడు ఎర్ర ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి బొల్లెపాక రాజేష్, సంఘ పెద్దలు రాజు, రాజన్న, జీడీ శ్రీకాంత్, పట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామికి ట్రెయినీ ఐపీఎస్ పూజలు

ధర్మసాగర్ (వేలేరు) : మండలంలోని మల్లికుదుర్ల గ్రామ శివారులో శ్రీ గట్టు మల్లికార్జున స్వామికి ట్రెయినీ ఐపీఎస్ ఆడెపు వర్షిత ఆదివారం పూజలు చేశారు. హనుమకొండకు చెందిన వర్షిత తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఆలయాన్ని సందర్శించారు. స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షితను ఆలయ ప్రధాన అర్చకుడు వినయ్ శర్మ కండువాతో సత్కరించారు. ఆమె వెంట ఆమె తల్లిదండ్రులు రాధారాణి, రాజా కట్టమల్లు ఉన్నారు.

మహనీయుడు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ వరలక్ష్మి తదితరులు

రఘునాథపల్లి: రాజ్యాంగాన్ని భారతదేశానికి అందించిన మహనీయుడు డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ అని ఎంపీపీ మేకల వరలక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని అయ్యవారిగూడెంలో ఆమె అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని అన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగం వలనే ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాల వారు హక్కులను సాధిస్తున్నారన్నారు. అంబేడ్కర్ ఆశయాలే స్ఫూర్తిగా యువకులు ఉన్నత చదువులు అభ్యసించి సమాజంలో గుర్తింపు పొందాలన్నారు. అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు గ్రామస్తులు కలిసికట్టుగా ముందుకు రావడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి వెంకటస్వామి, సర్పంచ్ పారునంది కొమురయ్య, అంబేడ్కర్ గౌరవ అధ్యక్షుడు తాళ్లపల్లి లింగం, అధ్యక్షుడు పారునంది వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, రవి, నాగరాజు, సాంబరాజు, అశోక్‌కుమార్, రాజు, రాజీవ్, సుజాత, వెంకటయ్య, కొమురయ్య, రామచంద్రు, గట్టయ్య, యాదయ్య, ఎల్లమ్మ, కొమురమ్మ, ప్రమీల, యాదమ్మ, సాంబయ్య, యాదగిరి, శ్రీనివాస్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

బండా ప్రకాశ్‌ను కలిసిన నాయకులు



జనగామ: బండా ప్రకాశ్‌ను సత్కరిస్తున్న ముదిరాజ్ సంఘ నాయకులు



జనగామ: బండా ప్రకాశ్‌కు బొకే అందజేస్తున్న అంబేడ్కర్ ఫొటో సాధన సమితి ప్రతినిధులు

జనగామ: తెలంగాణ శాసనమండలి నూతన డిప్యూటీ చైర్మన్‌గా నియమితులైన బండా ప్రకాశ్‌ను జనగామకు చెందిన ముదిరాజ్ సంఘం జిల్లా నాయకులు నీల యాదగిరి, ఇట్టమైన రమేష్, ఎనరాజు, అశోక్, శరత్ హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. అలాగే.. కరెన్సీపై డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ చిత్రం ముద్రించాలని అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జేరిపోతుల పరశురామ్ అసెంబ్లీ లాబీయింగ్‌లో ప్రకాశ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట రాష్ట్ర అధ్యక్షుడు భైరపాక బెంజిమెన్, సముద్రాల ప్రశాంత్, పిడుగు ఆశీర్వాదం ఉన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: బండా ప్రకాశ్‌ను ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు నీల గట్టయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ముదిరాజ్ మహాసభ జిల్లా కార్యదర్శి బూర్ల శంకర్, నీల రాజు, రేఖ, గోరంటల గిరితోపాటు తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరు: బండా ప్రకాశ్‌ను ఆదివారం హైదరాబాద్‌లో చిన్నపెండ్యాలకు చెందిన ముదిరాజ్ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మత్స్య కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా కార్యదర్శి నీల రాజు, ఈర్ల రాజు, శాగ ఉపేందర్, రమేష్, శ్రీనివాస్, రవి, యాదగిరి, రమేష్ శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి

జనగామ రూరల్: భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంత్ రవిదాస్ మహారాజ్ జయంతి వేడుకలు ఆదివారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అరుట్ల దశమంత్‌రెడ్డి పాల్గొని రవిదాస్ మహారాజ్ గొప్పతనాన్ని కొనియాడారు. రాష్ట్ర నాయకులు బొట్ల శ్రీనివాస్, డాక్టర్ రాజమౌళి, జిల్లా బాధ్యులు సోమరాజు, తోకల హరీష్, రడపాక ప్రదీప్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

లోన్ యాప్‌లకు ఆకర్షితులు కావొద్దు

చిల్పూరు: తక్కువ వడ్డీతో లోన్ ఇస్తామని సైబర్ నేరగాళ్లు వివిధ యాప్‌ల ద్వారా నిరుద్యోగ యువతను ఆకర్షిస్తున్నారని వాటి జోలికి పోయి నష్టపోవద్దని ఎస్సై వినయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కళాజాతా, పత్రికా ప్రకటన ద్వారా ప్రజలను హెచ్చరిస్తున్నప్పటికీ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బులు నష్టపోతున్నారని తెలిపారు. లోన్‌యాప్‌లను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు.

బియ్యం అందజేత



బచ్చన్నపేట: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరణిస్తే వారి కుటుంబాలకు టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అండగా ఉంటున్నారని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి అల్వాల ఎల్లయ్య అన్నారు. ఆదివారం మండలంలో ఇటీవల మృతి చెందిన అల్వాల మల్లేష్, తాండ్ర శేఖర్ కుటుంబ సభ్యులకు 50 కిలోల చొప్పున పొన్నాల పంపించిన బియ్యాన్ని అందించారు. ఎంపీటీసీ మసూద్, శ్రీనివాస్, మహిపాల్‌రెడ్డి, రాజయ్య, రమేష్, శ్రీనివాస్, రాంమోహన్‌రెడ్డి, వెంకటేష్, మల్లేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ నాగజ్యోతి

బచ్చన్నపేట: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ నిధుల ఖర్చులు, పని తీరును వివరించారు. సర్పంచ్‌లు పలు అంశాలపై ఎంపీడీఓ రఘురామకృష్ణ, ఈసీ జగదీష్‌ను నిలదీశారు. ఈసీ జగదీష్‌ను సస్పెండ్ చేయాలని, పంచాయతీ కార్యదర్శుల డబ్బుల రికవరీ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎంపీపీ నాగజ్యోతి జోక్యం చేసుకొని మనమందరం కలిసి మాట్లాడి ఒక నిర్ణయం తీసుకుందామనడంతో గొడవ సద్దుమణిగింది. గ్రిడ్ డీఈ, సర్పంచ్‌ల, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీష్‌రెడ్డి, దూడల కనుకయ్య, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

శ్రమశక్తి హమాలీ సంఘం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

దేవరుప్పుల: మండలకేంద్రంలోని శ్రమశక్తి హమాలీ సంఘం నూతన అధ్యక్షుడిగా కారుపోతుల శ్రీను ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా ఉప్పుల అంజయ్య, ప్రధానకార్యదర్శిగా మన్నూరు రాములు, కోశాధికారిగా గొడిశాల శ్రీని వాస్, జిల్లా కార్యవర్గ సభ్యులుగా గొడిశాల మల్లేష్, మండల కార్యవర్గ సభ్యులుగా దండెపెల్లి సోమేష్, కారుపోతుల ఉమేష్, రెడ్డిరాజుల కొండయ్య, మంచుల యాకయ్య, బోనగిరి సోమయ్య ఎన్నికయ్యారు.

గెస్ట్‌హౌస్ @ వందేళ్లు

- దేశ స్వాతంత్య్రానికి ముందే నిర్మాణం
- శిథిలావస్థకు చేరినా పట్టించుకోని పాలకులు



శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ అతిథి గృహం

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లిలోని ప్రభుత్వ అతిథిగృహం శిథిలావస్థకు చేరుతోంది. దేశానికి స్వాతంత్య్రం రాక ముందు(దాదాపు వందేళ్ల క్రితం) బ్రిటిష్ పాలకులు ఈ డాగ్‌బంగ్లా(గెస్ట్‌హౌస్) నిర్మించినట్లు సీనియర్ సిటిజన్లు చెబుతున్నారు. ఆరోజుల్లో గిర్దావర్లు, ప్రభుత్వ అధికారులు, పాలకులు.. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గం ఏర్పడిన తర్వాత గోక రామస్వామి నుంచి మొదలు ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు, ఉన్నతాధికారులు ఈ గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకునేవారు. కాలక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. కనీసం వాచ్‌మన్ కూడా లేడు. గేటుకు తాళం లేకపోవడంతో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. శిథిలావస్థకు చేరిన గెస్ట్‌హౌస్ స్థానంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి గ్రామపంచాయతీకి అప్పగిస్తే.. పలువురికి జీవనోపాధితో పాటు జీపీకి ఆదాయం సమకూరుతుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం



కరాటేలో శిక్షణ ఇస్తున్న మాస్టర్ రాజేందర్

జఫర్‌గఢ్: బాలికల ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ దోహదపడుతుందని రుద్రమాదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నెపు రాజేందర్ అన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో రాణిలక్ష్మీబాయి ఆత్మరక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో రాజేందర్ నేతృత్వంలో బాలికలకు కరాటేలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ కరాటే శిక్షణ వల్ల బాలికల్లో ఆత్మస్థైర్యం పెరగడంతో పాటు ఎవరిసాయం లేకుండా అపద సమయంలో ఇతరుల బారినుంచి రక్షించుకోవచ్చన్నారు. నెల రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. సీనియర్ మాస్టర్ ఎల్మకంటి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలి



మాట్లాడుతున్న అజ్మీరా సురేష్ నాయక్

జనగామ రూరల్: ఎస్టీ తెగల జాబితాలో బీసీ కులాలను చేర్చాలనే ప్రభుత్వ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీరా సురేష్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ జాబితాలో ఉన్న వాల్మీకి, బోయలతో పాటు బేదర, కిరాత, మాలి, తలయారి, చుండు వాళ్లు, కాయితీ లంబాడా, భాట్, చమర్ మధురాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగ సూత్రాలను పాటించకుండా ఇష్టానుసారం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఎస్టీ జాబితాలో చేర్చాలనుకోవడం సరికాదన్నారు.

పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సీసీ రోడ్డు పనుల ప్రారంభోత్సవంలో సతీష్‌రెడ్డి

బచ్చన్నపేట: పల్లెలే పట్టణాలకు పట్టుకొమ్మలని, రాష్ట్రంలోని అన్ని పల్లెలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు, కొడవటూర్ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ రూ.50 లక్షల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణాల కంటే పల్లెల్లోనే అన్ని మౌలిక వసతులు కల్పించడానికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. చెట్టి అయిలయ్య, రాములు, కనుకయ్య, కరుణాకర్, శేఖర్‌రెడ్డి, రాజమౌళి, శ్రీనివాస్, బాలసిద్దులు, మల్లయ్య పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ తిరుమల

చిల్పూరు: గ్రామాల్లో పేదల కోసం స్టేషన్‌ఘన్‌పూర్ లయన్స్ క్లబ్ వారు చేస్తున్న సేవలు అభినందనీయమని సర్పంచ్ మారేపల్లి తిరుమల అన్నారు. మండలంలోని రాజవరం పంచాయతీ ఆవరణలో ఆదివారం స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య, కంటి పరీక్షల శిబిరాన్ని సర్పంచ్, ఎంపీటీసీ లలితాదేవి ప్రారంభించి మాట్లాడారు. క్లబ్ కార్యదర్శి మధుసూదన్, కోశాధికారి అనీల్, విజయ్ చందర్, సురేందర్, దస్తగిరి, శ్రీనివాస్ ఉన్నారు. అనంతరం క్లబ్ బాధ్యులను సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు కృష్ణమోహన్‌రెడ్డి, శ్యాంకుమార్‌రెడ్డి అభినందించారు.

విజయవంతం చేయండి



మాట్లాడుతున్న సురేష్‌నాయక్

కొడకండ్ల: ఈ నెల 14న దేవరుప్పుల మండలం నుంచి పాలకుర్తి వరకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి హాథ్ సే హాథ్ జోడోయాత్రలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ కోరారు. ఆదివారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమనర్సయ్య, రాజేష్‌నాయక్, భిక్షపతి, శ్రీనివాస్, ఖలీం, అంజయ్య, వంశీ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాలకుర్తి టౌన్: సమ్మేళనంలో పాల్గొన్న 1993-1994 ఎస్ఎస్‌సీ బ్యాచ్..



బచ్చన్నపేట: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పాలకుర్తి టౌన్: చిన్నతనంలో ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు తిరిగి 30 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. మండల కేంద్రంలోని పాలకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993-1994 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబోధన చేసిన గురువులు మారోజు సోమయ్య, మహేశ్వరం సోమేశ్వర్‌రావు, ఎల్లంబట్ల శేషయ్య, పి.మహేందర్‌రెడ్డి, రామాంజనేయులును సన్మానించారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పాఠశాలకు రూ.1లక్షతో నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను గురువులతో కలిసి ప్రారంభించారు. ఎస్ఎంసీ చైర్మన్ జీడి సమ్మయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కొన్నెలో..

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న 2002-2003 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమేళనాన్ని ఆదివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు చెప్పిన గురువులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చంద్రశేఖర్, సురేష్, బాలరాజు, సుధాకర్, విజేందర్, శ్రీనివాస్, మహేందర్, శ్వేత, సంధ్య, రూప, లావణ్య, విజయతోపాటు తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటకు చేరిన సైకిల్‌యాత్ర

బచ్చన్నపేట: సీఎం కేసీఆర్ క్షేమమే తన ధ్యేయమని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పిడిషెట్టి రాజు అన్నారు. రాజు సిద్దిపేట జిల్లా కోహెడ నుంచి చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం బచ్చన్నపేటకు చేరుకున్న సందర్భంగా నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పుట్టిన రోజు వరకు సైకిల్‌పై తిరుపతికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిస్తానని తెలిపారు.

సేవాలాల్ జయంతి రోజున సెలవు ప్రకటించాలి

తరిగొప్పుల: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15న సెలవు దినంగా ప్రకటించాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ అధ్యక్షుడు ముడావత్ సంపత్‌నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ జిల్లాకు రూ.కోటి చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా రూ.33 కోట్లు నిధులు కేటాయించి సేవాలాల్ మహరాజ్ జయంతి, తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రతీ గిరిజన తండాలో సేవాలాల్, భవానీ మాత ఆలయాల స్థాపనకు భూమి కేటాయించాలని కోరారు. ధూపదీప నైవేద్యం అందిస్తున్న లంబాడా భావోజీలకు సాధు సంతులకు ప్రతినెల గౌరవ వేతనం రూ.10వేలు అందించాలని కోరారు. ప్రతిజిల్లా, నియోజకవర్గంలో గిరిజన భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు.

శివరాత్రి ఉత్సవాల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంపీటీసీ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని డివిజన్ కేంద్రంలోని శ్రీ స్వయంభూ రామలింగేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించనున్న ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను దేవాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు గన్ను నర్సింహులుగుప్తా మాట్లాడారు. ఈనెల 18న మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా 17న ఉదయం 11.45గంటలకు శ్రీ స్వయంభూ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేరోజున సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు, 18న శివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తారన్నారు. కల్యాణంపై కూర్చునే భక్తులు పసుపు, కుంకుమ, బియ్యం, పూలదండలు, కొబ్బరికాయలు, జాకెట్‌ముక్కలు, అగర్‌బత్తిలు, మంగళహారతి, రూ.1,016 తీసుకుని రావాలని, ముందుగా పేర్లను నమోదు చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాల కోసం 98495 10860, 98496 76700 నంబర్లలో సంప్రదించాలన్నారు. పూజారులు రామలింగయ్యశర్మ, దేవాలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు గన్ను రమేష్, పులి రమేష్, మహంకాళి రవీందర్, గట్టు రాజు, గట్టు రాజశేఖర్, కోల శ్రీనివాస్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



సాయం అందజేస్తున్న స్నేహితులు

బచ్చన్నపేట: చిన్ననాటి నుంచి తమతో కలిసి చదువుకున్న స్నేహితుడు మృతి చెందగా తోటి మిత్రులు అందరూ బాధిత కుటుండానికి అండగా నిలిచి చేయూత నందించారు. ఆదివారం మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన తాండ్ర శేఖర్ అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా 2005-06 పూర్వ ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు బాధిత కుటుంబ సభ్యులకు రూ.20వేలను అందించారు.